ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
తమిళనాడు
TAMILNADU
ఆదివారం 26 జనవరి 2025

13 రాష్ట్రానికి 'పద్మ'లు

నల్లికుప్పుస్వామి, అజిత్‌కుమార్, శోభనకు పద్మభూషణ్

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని 13 'పద్మ'లు వరించాయి. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం కేంద్రప్రభుత్వం ప్రకటించిన 139 పద్మ అవార్డుల్లో 13 రాష్ట్రాన్ని వరించడం విశేషం. ఇందులో మూడు 'పద్మభూషణ్'లు ఉండగా, ప్రసిద్ధ తెలుగు పారిశ్రామికవేత్త డాక్టర్ నల్లి కుప్పుస్వామి శెట్టి ఆ పురస్కారానికి ఎంపికవ్వడం విశేషం. అదే విధంగా సినీ నటులు ఎస్.అజిత్ కుమార్, శోభనా చంద్రకుమార్ కూడా పద్మభూషణ్‌కు ఎంపికయ్యారు. ఇందులో కుప్పుస్వామి శెట్టి తెలుగింటి బిడ్డ కాగా, మిగిలిన ఇద్దరూ తెలుగు సినీ పరిశ్రమతో సంబంధమున్నవారే కావడం మరో విశేషం. ఇక తమిళనాడు నుంచి పద్మశ్రీ పురస్కారానికి గురువాయూర్ దొరై (కళ), కె.దామోదరన్ (పాక శాస్త్రం), లక్ష్మీపతి రామసుబ్బయ్యార్ (సాహిత్యం, విద్యా - పాత్రికేయ రంగం), ఎండీ శ్రీనివాస్ (సైన్స్ - ఇంజనీరింగ్), పురిసై కన్నప్ప సంబంధన్ (కళ), ఆర్.అశ్విన్ రవిచంద్రన్ (క్రీడారంగం-క్రికెటర్), ఆర్‌జీ చంద్రమోగన్ (పారిశ్రామిక రంగం), రాధాకృష్ణన్ దేవసేనాపతి (కళ), శీని విశ్వనాథన్ (సాహిత్యం, విద్య), వేలు ఆసన్ (కళ-తప్పెట) ఎంపికయ్యారు. అదే విధంగా కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి చెందిన పి.దక్షిణామూర్తి (కళ-డోలు కళాకారుడు) కూడా పద్మశ్రీకి ఎంపికయ్యారు.

తెలుగుతల్లి ముద్దు బిడ్డ 'నల్లి'



నల్లి కుప్పుస్వామి, అజిత్‌కుమార్, శోభన, అశ్విన్, వేలు ఆసాన్

పద్మభూషణ్ వరించిన ప్రముఖుల్లో ఒకరైన నల్లి కుప్పుస్వామి చెట్టి తెలుగుతల్లి ముద్దు బిడ్డ. పద్మసాలీల సామాజిక వర్గానికి చెందిన ఆయన 1940లో కాంచీపురంలో జన్మించారు. వస్త్ర వ్యాపారంలో ప్రసిద్ధి చెందారు. వారి ఇంటిపేరైన 'నల్లి' పేరుతోనే ఎన్నో పట్టు వస్త్రాల షోరూంలు ప్రారంభించి, ప్రపంచవ్యాప్తంగా విస్తరించారు. కళా పోషకుడైన ఆయన.. భాషా సేవకుడు కూడా. ఆయన సేవలకు గుర్తుగా గౌరవ డాక్టరేట్ రాగా, గతంలో కేంద్రప్రభుత్వం 'పద్మశ్రీ'తో సత్కరించింది. మద్రాస్ నగరం పుట్టుపూర్వోత్తరాలు చెప్పగలిగిన ఏకైక వ్యక్తి ఆయనేనంటే అతిశయోక్తి కాదేమో. టి.నగర్‌గా మారిన చెరువు గురించి, పనగల్ పార్క్‌గా మారిన బురద రోడ్డు గురించి, దానిపై నడయాడిన ఎడ్ల బండ్ల గురించి చెప్పగలిగిన ఏకైక వ్యక్తి ఆయనే. ఇక పద్మ భూషణ్ అవార్డుకు ఎంపికైన ప్రముఖ నటులు అజిత్‌కుమార్, శోభన కూడా తెలుగు గడ్డతో, తెలుగు సినీరంగంతో సంబంధ బాంధవ్యాలు వున్నవారే కావడం విశేషం.

భాషోద్యమకారుల స్మారక స్థలం ప్రారంభం

- సీఎం స్టాలిన్ నివాళి



భాషోద్యమ వీరులు తాళముత్తు, నటరాజన్ సమాధులపై పుష్పవలయం ఉంచి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు తదితరులు

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందీ వ్యతిరేకోద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులు తాళముత్తు, నటరాజన్‌కు త్వరలో నిలువెత్తు కాంస్య విగ్రహాలను ఏర్పాటుచేస్తామని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. ఎగ్మూరులో తాళముత్తు, నటరాజన్ స్మారక మండపం వద్ద ఆ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నామని చెప్పారు. స్థానిక మూలకొత్తలం వద్ద నిర్బంధ హిందీ అమలు వ్యతిరేకిస్తూ రెండు విడతలుగా నిర్వహించిన ఉద్యమంలో తాళముత్తు, నటరాజన్ సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. వీరిని భావితరాలవారు స్మరించుకునేలా మూలకొత్తలం వద్ద స్మారక స్థలం ఏర్పాటు చేశారు. ఆ స్మారక స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.34.30 లక్షలతో పునర్నిర్మించింది. 1076 చదరపుటడుగుల విస్తీర్ణంలో, చుట్టూ ఎనిమిది అడుగుల ఎత్తు ప్రహరీతో కొత్త మెరుగులతో తీర్చిదిద్దింది. ఈ పునర్నిర్మిత స్మారక స్థలాన్ని శనివారం ఉదయం స్టాలిన్ ప్రారంభించారు. ఆ స్థలంలో ఉన్న భాషోద్యమవీరులు తాళముత్తు, నటరాజన్, డాక్టర్ ఎస్. ధర్మాంబాళ్‌అమ్మయార్ తదితరుల చిత్రపటాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు సామినాథన్, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ కళానిధి వీరాసామి, డీఎంకే జిల్లా శాఖ కార్యదర్శి ఆర్డీ శేఖర్, శాసనసభ్యులు ఐడ్రీమ్ మూర్తి, జేజే ఎబినేజర్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్ళిన స్టాలిన్‌కు స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. రహదారికి ఇరువైపులా నిలిచిన నగరవాసుల వద్దకు వెళ్లి ఆయన ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా కొంతమంది యువతులు స్టాలిన్‌తో సెల్ఫీలు తీసుకున్నారు.



గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రుల కోసం సిద్ధమవుతున్న సభా ప్రాంగణం



సచివాలయం వద్ద వాహన తనిఖీల్లో ప్రత్యేక దళం

నేడు జెండా పండుగ

రాష్ట్రవ్యాప్తంగా పటిష్ఠ భద్రత ● ఏర్పాట్లు సిద్ధం
● జార్జికోటపై మువ్వన్నెల పతాకం ఎగురవేయనున్న గవర్నర్

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జెండా పండుగకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. భారత గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం వాడవాడలా మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసు బలగాలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ భద్రత ఏర్పాటు చేశారు. 1.20 లక్షల మంది పోలీసులు భద్రతకు నియమితులయ్యారు. చెన్నైలో సుమారు 10 వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మెరీనాబీచ్ ఎళిలగమ్ భవనం ఎదుట పారిశ్రామికుల విగ్రహం ప్రాంతం వద్ద వేడుకలకు గవర్నర్ రవి, సీఎం స్టాలిన్, మంత్రులు, న్యాయమూర్తులు తదితర ప్రముఖులు ఆశీనులయ్యేందుకు భారీ పందిరిని నిర్మించారు. ఇదే విధంగా విదేశీ రాయబారులు, నగర ప్రముఖులు, స్పీకర్ అప్పావు, శాసనసభ్యులు, పోలీసు ఉన్నతాధికారులు ఈ వేడుకలను వీక్షించడానికి గ్యాలరీలు సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం 7.52 గంటలకు సీఎం స్టాలిన్ , 7.54 గంటలకు గవర్నర్ రవి సతీసమేతంగా వైమానిక దళం మోటరు సైకిళ్ల కాన్వాయ్‌తో వేడుకల వేదిక ప్రాంతానికి చేరుకుంటారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత త్రివిధ దళాల ప్రాంతీయ ఉన్నతాధికారులను, డీజీపీ, నగర పోలీసు కమిషనర్, ఇతర అధికారులను గవర్నర్‌కు పరిచయం చేస్తారు. ఆ తర్వాత ఉదయం 8గంటలకు ఆ చోట ఏర్పాటు చేసిన స్తంభంపై జాతీయ పతాకాన్ని గవర్నర్ రవి ఆవిష్కరిస్తారు. ఆ సమయంలో వైమానిక దళ హెలికాప్టర్ నుంచి పూలవర్షం కురిపించనున్నారు. అటుపిమ్మట త్రివిధ దళాల కవాతు ప్రారంభమవుతుంది. నావికాదళం శకటం, సముద్రతీర భద్రతాదళం శకటం ఊరేగింపును గవర్నర్ వీక్షించనున్నారు. సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్, రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళం, విపత్తుల నివారణ దళం, సముద్రతీర పోలీసు దళం, హోంగార్డు తదితర శాఖలకు చెందిన సభ్యులు, కమెండోలు, పోలీసులు కవాతు నిర్వహిస్తారు. ఈ ప్రదర్శనలు ముగిశాక ధైర్య సాహసాలను ప్రదర్శించినవారికి అన్నా పతకం, కోట్టై అమీర్ మత సామరస్య పతకం, వరి అధికోత్పత్తికి సంబంధించిన సి.నారాయణసామి నాయుడు స్మారక పతకం, విశిష్టసేవాపరులైన పోలీసులకు గాంధీ స్మారక పతకాలు, విశిష్ట సేవలందించిన పోలీసుస్టేషన్‌కలు ట్రోఫీలను ముఖ్యమంత్రి బహూకరించనున్నారు. పతకాలు పొందినవారంతా స్టాలిన్‌తో గ్రూప్‌ఫొటో తీసుకుంటారు. ఆ తర్వాత గవర్నర్ పక్కనే కూర్చుని వివిధ శాఖలకు చెందిన శకటాల ఊరేగింపు, బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలను వీక్షించనున్నారు. నగరంలోని ఐసీఎఫ్ కర్మాగారం వద్ద, కోయంబేడులోని మెట్రోరైలు సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద, డీజీపీ కార్యాలయం వద్ద, గ్రేటర్‌చెన్నై కార్పొరేషన్ వద్ద, హైకోర్టు ప్రాంగణం వద్ద, రిజర్వు బ్యాంక్ వద్ద, సీఎండీపీ కార్యాలయం, మెట్రోవాటర్ బోర్డు కార్యాలయం వద్ద, దక్షిణ రైల్వే ప్రధాన కేంద్రం వద్ద కూడా ఈ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇదే విధంగా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు.



చెన్నై సచివాలయంలో సీఎంను ఆహ్వానిస్తున్న అరిటాపట్టివాసులు

నేడు అరిటాపట్టికి సీఎం స్టాలిన్

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అరిటాపట్టికి ఆదివారం ముఖ్యమంత్రి స్టాలిన్ వెళ్లనున్నారు. మదురై జిల్లా అరిటాపట్టి, పరిసర ప్రాంతాల్లో టంగ్‌స్టన్ ఖనిజం వెలికితీయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీనిపై స్థానికులు ఆందోళనలు చేపట్టారు. వారికి పలు పార్టీలు మద్దతు తెలిపాయి. టంగ్‌స్టన్ సొరంగం వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతినిధులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. ప్రతినిధుల విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్రం, టంగ్‌స్టన్ సొరంగం వేలం శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో, అరిటాపట్టి, పరిసర గ్రామవాసులు సంబరాలు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు శనివారం సచివాలయంలో సీఎంను కలుసుకొని, తమ గ్రామానికి ఆహ్వానించారు. దీనిపై సీఎం తన ఎక్స్ పేజీలో... మీ ప్రేమానురాగాలు అంగీకరించేందుకు రేపు అరిటాపట్టికి వస్తున్నా' అంటూ ట్వీట్ చేశారు.

ప్రజాస్వామ్యానికి మూలస్తంభం ఓటు

● గవర్నర్ ఆర్ఎన్ రవి



ఉత్తమ ఓటు హక్కు వినియోగదారులను సన్మానిస్తున్న గవర్నర్

ప్యారీస్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి మూలస్తంభం ఓటు అని గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలోని కలైవానర్ అరంగంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశపౌరులుగా, ఓటరుగా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా దేశం అభివృద్ధి చెందడానికి ప్రతి భారతీయుడు కారణమని, ప్రస్తుతం గ్రామాల్లోనే పోలింగ్ శాతం అధికంగా నమోదవుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఎంతోమంది మహానుభావులు రక్తం ధారపోశారని, వారి త్యాగం ప్రతిపౌరుడు గుర్తు చేసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు తీరిక సమయంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో కొంతమంది నోటాకు ఓటేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యాన్ని గౌరవించినట్లేనని అన్నారు. మరికొంతమంది పోలింగ్ బూత్ ఛాయలకే రావడంలేదని, అలాంటి వారికీ ఓటుపై అవగాహన కల్పించాలన్నారు. తమ తల్లిదండ్రులకు, బంధువులకు అవగాహన కల్పించి వారందరూ కూడా వచ్చి ఓటేసేలా ఓటు హక్కులేని పాఠశాల విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. 18 ఏళ్లు పూర్తయిన వారు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని గవర్నర్ కోరారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్, రాష్ట్ర ఎన్నికల అధికారి జ్యోతి నిర్మలాస్వామి, జీసీసీ కమిషనర్ కుమర గురుపరన్, కలెక్టర్ రేష్మి పాల్గొన్నారు.

చేపాక్కంలో చిందేసిన క్రికెట్





వికెట్ తీసిన ఆనందంలో భారత క్రికెటర్లు



భారత కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ కరచాలనం





జోస్ బట్లర్ బ్యాటింగ్

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం మరోసారి క్రికెట్ ఫీవర్‌లో మునిగింది. స్థానిక చేపాక్కం ఎంఏ చిదంబరం క్రికెట్ మైదానంలో శనివారం సాయంత్రం భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన రెండో టి20కి అభిమానులు భారీగా తరలివచ్చారు. మొదటి టి20లో భారత్ విజయం సాధించడంతో ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఎగబడ్డారు. మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు అయినప్పటికీ మధ్యాహ్నం నుంచే అభిమానులు భారీగా స్టేడియానికి తరలివచ్చారు. భారత్ జెర్సీలతో తరలివచ్చిన అభిమానులు 'ఇండియా...ఇండియా' అంటూ నినాదాలు చేశారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి లాంటి సీనియర్లు లేకపోయినా యువ క్రికెటర్లను చూసేందుకు ఎగబడ్డారు. కొందరు అభిమానులు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జెర్సీలతో తరలివచ్చారు. అలా వచ్చిన అభిమానులు 'మహేంద్ర సింగ్ ధోని' అంటూ కేకలు వేశారు. ఇక, అభిమానులు తమ చెంపలు, నుదుటిపై తమకిష్టమైన క్రికెటర్ల పెయింట్లు వేయించుకున్నారు. అలాగే, భారత్ జెండాలు కూడా భారీగా కొనుగోలు చేశారు. కాగా, చేపాక్కం క్రికెట్ స్టేడియంలో భారత్ జట్టు గత 2023 ఆగస్టు 8న జరిగిన ప్రపంచ ఛాంపియన్ పోటీల్లో ఆస్ట్రేలియాతో తలపడగా, ఏడాదిన్నర తర్వాత మళ్లీ భారత్ జట్టు చేపాక్కంలో ఆడింది. స్టేడియంలోకి వెళ్లిన అభిమానులు, తమ అభిమాన క్రికెటర్లు చేస్తున్న ప్రాక్టీస్ చూస్తూ వారిని ఉత్సాహపరిచేలా కేకలు, విజిల్స్‌తో కేరింతలు కొట్టారు. పలువురు క్రికెటర్లు చేతులు చూపుతూ అభిమానులను మరింత ఉత్సాహపరిచారు. మ్యాచ్ ముగిసిన అనంతరం అభిమానుల కోసం చెన్నై మెట్రోపాలిటన్ కార్పొరేషన్ (ఎంటీసీ) ప్రత్యేక బస్సులు, దక్షిణ రైల్వే ప్రత్యేక రైళ్లు నడిపాయి. అలాగే, చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అర్ధరాత్రి 12 గంటల వరకు రైళ్లు నడిపింది. మ్యాచ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్టేడియం చుట్టూ పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. భద్రతా చర్యల్లో భాగంగా మెరీనా తీరం, సర్వీసు రోడ్డు, చేపాక్కం ఎమ్మార్టీఎస్ రైల్వేస్టేషన్, స్టేడియం పక్కనే వెళ్లే రైలు మార్గాల్లో పోలీసులు గస్తీ పనులు చేపట్టారు.

సమాచార దర్శిని

నేడు ఆంధ్రా క్లబ్‌లో 'శ్రీ త్యాగరాజ సంకీర్తనార్చన'

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక, 'శ్రీవాణి' సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టి.నగర్, విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు మల్లాది అనూష బృందం ఆధ్వర్యంలో 'శ్రీ త్యాగరాజ సంకీర్తనార్చన' జరుగనుంది. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర పోలీసు శాఖలో 21 మందికి రాష్ట్రపతి పురస్కారాలు

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలకు అందజేసే రాష్ట్రపతి పురస్కారానికి రాష్ట్రానికి చెందిన 21 మంది ఎంపికయ్యారు. రాష్ట్రంలో 2025వ సంవత్సరానికి రాష్ట్ర పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన ఐజీలు దురైకుమార్, రాధిక సహా 21 మంది అధికారులు పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో ఎస్పీలు జయలక్ష్మి, స్టాలిన్, ఏఎస్పీలు దినకరన్, ప్రభాకరన్, డిప్యూటీ కమిషనర్లు వీరపాండి, సబ్ ఇన్‌స్పెక్టర్లు మదియళగన్, బాబు తదితరులున్నారు.

జనార్దనన్ సేవలు అభినందనీయం



జ్ఞాపిక అందుకుంటున్న జనార్దనన్

వేలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వేలూరులో వీఐటీ యూనివర్శిటీ, రాజ్ టీవీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘ అధ్యక్షుడు, టెక్నికల్ విద్యా సంస్థ ఉపాధ్యక్షుడు జనార్దనన్‌ను సత్కరించారు. రెడ్‌క్రాస్‌కు ఆయన అం దించిన సేవలు అభినంద నీయమని కొనియాడారు. అనంతరం వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్ చేతుల మీదుగా సత్కరించి, 'సేవల నాయకుడు' బిరుదును ఆపాదించారు. వీఐటీ వర్శిటీ నిర్వాహకులు ముత్తు, రాజ్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ రవేంద్రన్, డైరెక్టర్ భాస్కరరాజు, ఆర్గనైజర్ ధర్మరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

వేలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వేలూరు ప్రధాన వీధులు, బస్టాండుల్లో తమిళగ వెట్రి కళగం పార్టీ నాయకులు శనివారం ఉదయం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలూరు గుడియత్తం పరిసరాల్లోని విద్యార్థులకు, ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కలిగించేలా ఇంటింటి వెళ్లి కరపత్రాలు ఇచ్చి, ప్రజల్ని తమ నాయకుడు విజయ్‌ను గెలిపించాల్సిందిగా కోరారు. గుడియాత్తం పార్టీ అధ్యక్షుడు ఇళంగోవన్, మహిళా విభాగం నాయకులు, పార్టీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ర్యాలీ



ర్యాలీలో డీఎంకే నాయకులు, కార్యకర్తలు

తిరుత్తణి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు స్థానిక డీఎంకే నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాధాకృష్ణన్ బాలుర ప్రభుత్వోన్నత పాఠశాల రోడ్డులో ఆరోగ్యం, వ్యవసాయం, జీవనోపాధి, పేదరిక నిర్మూలన, బీమా మొదలైన ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తిరుత్తణి రెవెన్యూ డివిజనల్ కమిషనర్ దీప ప్రారంభించారు. తిరుత్తణి గాంధీరోడ్డు మీదుగా సుమారు 300మంది రైతులతో సాగిన ఈ ర్యాలీ మురుగప్పన్‌నగర్‌లోని కల్యాణమండపం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో దానం ఫౌండేషన్ ఛైర్మన్ సెంథిలరసి, యూనియన్ బ్యాంకు మేనేజర్ గణేష్, వ్యవసాయ సంచాలకులు కళావతి, ట్రెజరీ సంస్థ నాయకురాలు వాణిశ్రీ, డీఎంకే పార్టీ నాయకులు, రైతులు సహా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీబాలాజీ దంత వైద్యకళాశాల స్నాతకోత్సవం

● 106 మందికి పట్టాల ప్రదానం



విద్యార్థినికి పట్టాను ప్రదానం చేస్తున్న డాక్టర్ పునీత్ బాత్రా

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీబాలాజీ దంత వైద్య కళాశాల 31వ స్నాతకోత్సవంలో 106 మంది పట్టభద్రులు పట్టాలను అందుకున్నారు. వీరిలో ముగ్గురు ర్యాంక్ హోల్డర్లకు పతకాలను కూడా అందజేశారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా మానవ్ రచన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ అండ్ స్టడీస్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పునీత్ బాత్రా విచ్చేసి పట్టాలను ప్రదానం చేశారు. కళాశాల ఛైర్‌పర్సన్ డాక్టర్ శ్రీనిషా, మేనేజింగ్ డైరెక్టర్ ఇరా ఎన్ ఇలమారన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.భూమినాథన్, ఎంపీ ఎస్.జగద్రక్షగన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో నిబంధనలు పాటిస్తున్నారా?

● రాష్ట్రప్రభుత్వాన్ని వివరణ కోరిన హైకోర్టు

ప్యారీస్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామసభల్లో నిబంధనలు పాటిస్తున్నారా? అన్న అంశంపై వివరణ దాఖలు చేయాలంటూ రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుచ్చి తురయూర్‌కు చెందిన గురునాథన్ దాఖలు చేసిన పిటీషన్‌లో, రాష్ట్రంలోని స్థానిక సంస్థల తరుపున నిర్వహించ దలిచిన గ్రామసభల తేదీ, స్థలం తదితర వివరాలను వారం రోజులముందే ప్రకటించాల్సివుంది. గ్రామసభలు జరిగే సమయంలో గ్రామస్తులు ప్రతిపాదించే తీర్మానాల్ని సమావేశం అంగీకరించాలి. ఈ పనులను ఆయా ప్రాంతాలకు చెందిన తహసీల్దారు పరిశీలించి నిర్ధారించాలి. అంతేకాకుండా గ్రామసభల గురించి జిల్లా కలెక్టర్లందరికీ సర్క్యులర్ జారీ చేయాలంటూ, హైకోర్టు 2018వ సంవత్సరం జారీ చేసిన ఉత్తర్వులను స్థానిక సంస్థల అధికారులు సక్రమంగా అమలు పరచడం లేదు. దీంతో గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సహా అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవల్సిందిగా పిటీషనర్ కోరారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తులు టీకారామన్, విక్టోరియా గౌరీలతో కూడిన ధర్మాసనం ముందు ఇరు తరుపు పిటీషనర్ల న్యాయవాదులుఒ హాజరయ్యారు. అనంతరం గ్రామసభల్లో నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నారా?, వాటిని స్థానిక తహసీల్దార్లు పరిశీలిస్తున్నారా? అని రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర వివరణలతో నివేదిక దాఖలు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేపటి నుంచి మద్రాస్ విశ్వవిద్యాలయంలో 'బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యం - బహుముఖీనత'పై అంతర్జాతీయ సదస్సు

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ యూనివర్శిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో 'బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ ఆలీ షా సాహిత్యం - బహుముఖీనత' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరగనుంది. మెరీనాలోని రజతోత్సవం ప్రాంగణంలో జరుగనున్న ఈ సదస్సుకు తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు సంచాలకుడిగా వ్యవహరించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుండగా, ఈ కార్యక్రమానికి పీఠాపురానికి చెందిన శ్రీ విశ్వవిజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అదేవిధంగా విశిష్ట అతిథిగా హైదరాబాద్‌లోని యోగాలయా రీసెర్చ్ సెంటర్‌కు చెందిన విశ్వర్షి డాక్టర్ వాసిలి వసంతకుమార్, గౌరవ అతిథిగా ఆఫ్రికాకు చెందిన ఆచార్య శ్రీదేవి శ్రీకాంత్, ప్రత్యేక అతిథిగా గుంటూరుకు చెందిన రచయిత్రి, విమర్శకురాలు ఆచార్య సీహెచ్ సుశీలమ్మ, ఆత్మీయ అతిథులుగా అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ తెలుగుశాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య షేక్ మస్తాన్, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య హాజరుకానున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు కీలకోపన్యాసం చేయనున్నారు. అదేవిధంగా మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సదస్సు సమాపనోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర, విశిష్ట అతిథిగా తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకుడు డాక్టర్ తోటకూర ప్రసాద్, గౌరవ అతిథిగా ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య గంపా వెంకటరామయ్య, ప్రత్యేక అతిథిగా శ్రీ విశ్వవిజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం కేంద్ర కమిటీ సభ్యుడు నడింపల్లి తిరుపతి వెంకటప్రసాద్ వర్మ, ఆత్మీయ అతిథులుగా మదురై కామరాజ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ, రెప్కో బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య హాజరుకానునానరు. ఇక విజయనగరంలోని ప్రభుత్వ మహారాజ సంస్కృత కళాశాల విశ్రాంతాచార్యుడు డాక్టర్ అయల సోమయాజుల గోపాలరావు సమాపనోత్సవ సందేశం అందించనున్నారు. ఈ సదస్సుకు అందరూ ఆహ్వానితులేనని ఆచార్య విస్తాలి విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మొత్తం 8 సమావేశాల్లో 50 మందికి పైగా పత్ర సమర్పణ చేయనున్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు

తిరుత్తణి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయ ఉప ఆలయం తిరువాలంగోడు వఠారణేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ వేడుకలకు రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఈ ఏడాది మహా శివరాత్రి ఏర్పాట్లపై తిరుత్తణి ఆలయ జాయింట్ కమిషనర్, స్థానిక ప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. సదుపాయాల కల్పన, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు, ప్రత్యేక బస్సులపై చర్చించారు.

తిరువణ్ణామలైలో బండరాయి తొలగింపు



ప్యారీస్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షంలో తిరువణ్ణామలై క్షేత్రంలో అన్నామలైయార్ కొండ నుంచి దొర్లిపడిన బండరాయిని తొలగించినట్లు ప్రజా పనుల శాఖ అధికారులు తెలిపారు. గత నెలలో ఫెంగల్ తుఫాన్ ప్రభావం కారణంగా 40 టన్నుల బండరాయి దొర్లి వావూసినగర్ నివాస ప్రాంతంలో ఆగింది. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లా యంత్రాంగం ఈనెల 22న బండరాయిని పరిశీలించింది. ప్రజా పనుల శాఖ మంత్రి ఏవీ వేలు బండరాయి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. తిరుచ్చి నుంచి తిరువణ్ణామలైకు వెళ్లిన నిపుణుల బృందం బండరాయిని బ్రేకర్ యంత్రం ద్వారా ముక్కలు చేసి, ఆ శిథిలాలను లారీల ద్వారా తొలగించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం



వైద్యశిబిర కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు

తిరుత్తణి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా 4వ శనివారం మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 25న ఉదయం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో కంటివైద్య శిబిరాన్ని పళ్లిపట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సునీల్‌కుమార్ ప్రారంభించారు. చికిత్సపొందిన వారికి నిర్వాహకులు మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురుమూర్తి, కుశాల్ చంద్‌జైన్, ఈశ్వర్‌ప్రసాద్ సహా పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

నటుడు గంజా కరుప్పుపై ఫిర్యాదు

అడయార్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): శివగంగై జిల్లాకు చెందిన సినీ నటుడు గంజా కరుప్పుపై రమేష్ అనే వ్యక్తి మధురవాయల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని నెలలుగా ఇంటి అద్దె చెల్లించక పోగా ఖాళీ చేయడం లేదని ఆన్‌లైన్ ద్వారా పేర్కొన్నారు. మదురవాయల్ కృష్ణా నగర్‌లో రమేష్‌కి చెందిన ఇంటిని నెలకు రూ.20 వేలకు అద్దెకు తీసుకున్న గంజా కరుప్పు.. చెన్నైలో షూటింగ్ జరిగే సమయంలో ఆ ఇంట్లో ఉంటారు. అయితే, గత కొన్ని నెలలుగా ఇంటి అద్దె చెల్లించలేదు. ఇది రూ.3 లక్షలకు చేరింది. దీనిపై రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం తనకు ఇచ్చిన 'కలైమామణి' అవార్డు షీల్డు కనిపించడం లేదని గంజా కరుప్పు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

పొంగల్ బహుమతులు
రేషన్ కార్డుదారులకు రేషన్ సిబ్బంది ఫోన్

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పొంగల్ బహుమతులు తీసుకెళ్లాలంటూ రేషన్ కార్డుదారులకు రేషన్ దుకాణాల ఉద్యోగులు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం చేరవేస్తున్నారు. పొంగల్ సందర్భంగా 2.21 కోట్ల బియ్యం కార్డులకు తలా కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, చెరుకు గడతో బహుమతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 9 నుంచి 13వ తేది వరకు పొంగల్ బహుమతుల పంపిణీ జరుగ్గా, 1.87 కోట్ల మంది మాత్రమే తీసుకున్నారు. మిగిలిన వారికి ఈనెల 25వ తేది శనివారం వరకు అందజేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో, అధికారుల సూచనల మేరకు పొంగల్ బహుమతి అందుకోని రేషన్ కార్డుదారులను రేషన్ దుకాణ సిబ్బంది సెల్‌ఫోన్ ద్వారా సంప్రదించి, బహుమతి తీసుకెళ్లాలని కోరుతున్నారు. ఈ విషయమై రేషన్ ఉద్యోగులు మాట్లాడుతూ... ఈ ఏడాది పొంగ్ బహుమతిలో నగదు లేకపోవడంతో పలువురు తీసుకొనేందుకు ఆసక్తి చూపలేదన్నారు. గత ఏడాది నగదు ఇవ్వడంతో నిర్ణీత సమయంలోనే పంపిణీ జరిగిందన్నారు. ప్రస్తుతం 100 శాతం పొంగల్ బహుమతులు అందించాలనే అధికారుల ఉత్తర్వులతో, బహుమతి తీసుకోని వారిని సెల్‌ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

'వెంగైవయల్' ఘటన
చర్చనీయాంశంగా ఆడియో సంభాషణ

అడయార్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా వేంగైవయల్‌లో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులో మానవ మలవిసర్జన మలినాన్ని కలిపిన కేసును సీబీఐకు అప్పగించాలని మద్రాస్ హైకోర్టులో పిటీషన్ దాఖలైంది. దానిపై వాడివేడిగా విచారణ జరుగుతున్న సమయంలో ఈ కేసులో నిందితుల్లో ఒకరైన సుదర్శన్‌కు ఆయన తల్లి, అత్తకు మధ్య జరిగిన ఆడియో సంభాషణ చర్చనీయాంశంగా మారింది. ఈ కేసును విచారిస్తున్న సీబీసీఐడీ అధికారులు ఎంత ఒత్తిడి తెచ్చినా, కొట్టినా అంగీకరించనే వద్దని సుదర్శన్‌కు తల్లి చెబుతున్నారు. అలాగే, అతని అత్త కూడా ఆందోళనగా మాట్లాడుతున్నారు. కాగా, ఈ కేసును సీబీసీఐడీ విచారిస్తోంది. ఈ ఘటన 2022 డిసెంబరులో జరుగగా, 2023 జనవరి 14వ తేదీన కేసును సీబీసీఐడీకి బదిలీ చేశారు. 397 సాక్షులను విచారించగా, 196 మొబైల్ ఫోన్లు, 87 సెల్‌ఫోన్ టవర్లలో రికార్డైన వివరాలను సీబీసీఐడీ అధికారులు సేకరించారు. అయితే, ఇప్పటివరకు చార్జిషీటును దాఖలు చేయలేదు. దీంతో ఈ కేసు విచారణను సీబీఐకు అప్పగించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై శుక్రవారం విచారణ జరిగింది. ఆ సమయంలో ఈ ఆడియో సంభాషణ చర్చనీయాంశంగా మారింది.

ఉచిత ప్రయాణ టిక్కెట్లకు
మహిళల నుంచి నగదు వసూలు

● విధుల నుంచి కండక్టర్ తొలగింపు

పెరంబూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అందించే టిక్కెట్లకు నగదు వసూలు చేస్తున్న తాత్కాలిక కండక్టర్‌ను విధుల నుంచి తొలగించారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాల్లో సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే పథకం అమలులో ఉంది. ఈ క్రమంలో, ఈరోడ్ జిల్లా పుంజై పులియంపట్టి నుంచి పన్నేరికి వెళ్తున్న ప్రభుత్వ సాధారణ బస్సులో పలువురు మహిళలు ప్రయాణించారు. ఆ బస్సు తాత్కాలిక కండక్టర్ ధరణీధరన్, ఇది స్పెషల్ బస్సు అంటూ మహిళల నుంచి నగదు వసూలు చేయడంతో, వారు వాగ్వాదానికి దిగారు. ఆ దృశ్యాలను తోటి ప్రయాణికులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, ధరణీధరన్‌ను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చేపల మార్కెట్ వ్యర్థాలను తొలగించండి

● కమిషనర్‌కు ఎస్‌డీపీఐ నేతల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌డీపీఐ నేతలు

వేలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కస్‌నాల్ పేటలో చేపల మార్కెట్ నుంచి వచ్చే వ్యర్థాల దుర్వాసన కారణంగా స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారని సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నేతలు కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నెల రోజుల నుంచి చేపలమార్కెట్‌లో వ్యార్థాలను తరలించకపోడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. దీనితో పాటు రాత్రిపూట దోమలు విజృంభి స్తున్నాయని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. దీనిపై వెంటనే అధికారులు పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని ఆయన అన్నారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్‌కు దీనిపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుల్తాన్ భాషా, కార్యదర్శి అసేన్ షిరాజ్, ట్రెజరర్ కాదర్, సైదాపేట నగర అధ్యక్షుడు జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి విగ్రహం మాట్లాడుతుందంటూ మోసం

● ఆరుగురి అరెస్ట్

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తేని సమీపంలో స్వామి విగ్రహానికి పూజలు చేస్తే, మాటలు వస్తాయని, సంపద పెరుగుతుందని పంచలోహ విగ్రహాన్ని రూ.కోటికి బేరమాడి, రూ.5 వేలు అడ్వాన్స్ తీసుకొని మోసం చేసిన వ్యవహారంలో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తేని సుక్కువాంపట్టికి చెందిన ఆండవర్ (47) తన కారును పళనిచెట్టిపట్టి వర్క్ షాప్‌లో రిపేర్‌కు ఇచ్చారు. షాప్ మెకానిక్, మదురై జిల్లా టి.కల్లుపట్టి శివ అతనికి పరిచయమయ్యాడు. 'తనకు తెలిసిన వారి వద్ద స్వామి విగ్రహం ఉందని, ఆ విగ్రహాన్ని పూజిస్తే, వారితో మాట్లాడుతుందని, ఇంట్లో సంపద పెరుగుతుందని' శివ తెలిపాడు. విగ్రహం కొనుగోలుకు ఆండవర్ ఆసక్తి చూపడంతో, ఈనెల 23న ఆండవర్ తన స్నేహితుడు నాగరాజ్‌తో కలసి వర్క్‌షాప్‌కు వెళ్లాడు. వారికి మదురై జిల్లా అత్తంగరైపట్టికి చెందిన తంగమణి, విరుదునగర్ జిల్లా కూమాపట్టికి చెందిన బాలమురుగన్, మదురై టి.కృష్ణాపురానికి చెందిన సంబళగు, అరంతాంగి మీమిసల్‌కు చెందిన రవిచంద్రన్, మదురై టి.కల్లుపట్టికి చెందిన సూర్యప్రకాష్‌ను మెకానిక్ శివ పరిచయం చేశాడు. విగ్రహాన్ని చూపించిన వారు, రూ.కోటి ఇస్తే ఇస్తామని తెలపడంతో అంగీకరించిన ఆండవర్, అడ్వాన్స్‌గా శివకు రూ.5 వేలు అందజేయగా, వారు కారులో ఉన్న విగ్రహాన్ని అందించారు. ఆండవర్ ఇంటికి వచ్చి విగ్రహానికి పూజలు చేయగా, విగ్రహం మాట్లాడకపోవడం గమనించాడు. వర్క్ షాప్‌కు వెళ్లి అడ్వాన్స్ తిరిగి చెల్లించాలని కోరాడు. అందుకు నిరాకరించిన ఆరుగురు, చంపుతామని ఆండవర్‌ను బెదిరించారు. ఆండవర్ ఫిర్యాదుతో పళనిచెట్టిపట్టి ఇన్‌స్పెక్టర్ షణ్ముగసుందరం నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.



మాట్లాడుతుందంటూ నమ్మించిన విగ్రహం

తిరుత్తణిలో పెరిగిపోతున్న దొంగతనాలు

● ఎస్ఐ పోస్టు భర్తీ చేయాలంటున్న స్థానికులు

తిరుత్తణి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి పట్టణంలో చోరీలు పెరిగిపోతున్నాయి. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని భారతీయార్ వీధికి చెందిన ధర్మరాజు కిరాణా దుకాణం నడుపుతున్నాడు. ఈ 22న బుధవారం రాత్రి తన దుకాణం మూసివేసిన ఇంటికి వెళ్లగా, అర్ధరాత్రి సమయంలో ఆ దుకాణంలో దొంగలు పడి, సుమారు 10వేల విలువైన సరకులు, 14వేలు నగదు చోరి జరిగింది. మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అదే విధంగా ఆ పరిసర ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా ఏటీఎం దొంగతనాలు, వాహనాలు, దేవాలయాల్లో చోరీలకు పాల్పతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మూడేళ్లగా తిరుత్తణి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉందని, ఆ పోస్టును భర్తీ చేయకపోవడంతో దొంగలు విజృంభిస్తున్నారని వాపోయారు. కేవలం చుట్టుపక్కల ప్రాంతాలకు 50 మంది మాత్రమే కానిస్టేబుళ్లు ఉన్నారని, వారు రాత్రిళ్లు గస్తీ కాస్తున్నారని, అయినా కూడా దొంగల ఆగడాలు తగ్గలేదన్నారు. కనీసం ఇప్పటికైనా తమ ప్రాంతానికి ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పుళల్‌లో 106 కిలోల గుట్కా స్వాధీనం

● నలుగురి అరెస్టు



అరెస్టయిన నలుగురు

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):నగర శివారు ప్రాంతం పుళల్ వద్ద రెండు కార్లలో 106 కిలోల గుట్కా, పొగాకు వస్తువులను అక్రమంగా తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పుళల్ బాలాజీనగర్‌లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లలో పార్శిళ్లను నలుగురు ఎక్కిస్తుండటం గమనించారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళి వాటిని తనిఖీ చేయగా నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు వెలుగు చూశాయి. వాటిని కార్లలో తరలించేందుకు ప్రయత్నించిన రెడ్‌హిల్స్‌కు చెందిన కరగువేల్, తూత్తుకుడి జిల్లా విలాత్తికుళంకు చెందిన చిన్నతంబి, కొళత్తూరుకు చెందిన కృష్ణరాజ్, అంబత్తూరుకు చెందిన కన్నయ్య అలియాస్ మురళిని అరెస్టు చేశారు. ఈ నలుగురు బెంగళూరు నుంచి వాటిని తరలించి నగరంలో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గుట్కా తరలించేందుకు ఉపయోగించిన రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంటెక్ విద్యార్థిని మృతి



మృతురాలు జోషిత (ఫైల్)

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎంటెక్ విద్యార్థిని మృతిచెందింది. తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి అన్నై అవెన్యూకు చెందిన కుమార్ కుమార్తె జోషిత (24) ఎంటెక్ చదువుతోంది. శుక్రవారం సాయంత్రం పొన్నేరి బస్టాండ్ మీదుగా హెల్మెట్ ధరించకుండా బైక్‌పై బయల్దేరింది. పొన్నేరి-రెడ్‌హిల్స్ రహదారి మూకాంబిగై నగర్ వద్ద బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ఘటనలో లారీ చక్రం కింద చిక్కుకున్న జోషిత తీవ్రగాయాలతో దుర్మరణం చెందింది. ఈ ఘటనపై రెడ్‌హిల్స్ ట్రాఫిక్ పోలీసులకు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆటోఫైనాన్షియర్ దారుణహత్య

వేలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న ఫైనాన్షియర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్యచేశారు. వేలూరులోని రంగాపురం నత్తంరోడ్డుకు చెందిన సెంథిల్‌కుమార్ (39) ఆటోఫైనాన్స్ ఆఫీస్‌ను నడుపుతున్నాడు. సెంథిల్‌కుమార్‌కు భార్య మంజరి, కుమార్తె యువశ్రీ ఉన్నారు. ప్రతిరోజు కుమార్తెను పాఠశాలలో వదిలేందుకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో కుమార్తెతో వెళ్తుండగా మార్గమధ్యంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు సెంథిల్‌కుమార్‌పై దాడిచేసి, కత్తితో గొంతుకోసి పరారయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మత్తు ఇంజెక్షన్‌తో ఇద్దరు యువకుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

ప్యారీస్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు అధికంగా ఉన్న తిరుప్పూర్‌లో చట్ట విరుద్ధంగా మత్తు ఇంజెక్షన్ విక్రయించిన ఇద్దరు యువకులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. తిరుప్పూర్‌లో బనియన్ పరిశ్రమలు, అద్దకపు యూనిట్లు, రెడీమెడ్ దుస్తుల తయారీ కంపెనీల్లో వలస కార్మికులు నొప్పి నివారణ ట్యాబెట్లను మత్తుకోసం వినియోగించడం ఇటీవలజాగా పెరుగుతూ వస్తోంది. దీన్ని అడ్డుకునేందుకు పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. పళనియమ్మాళ్ పాఠశాల వెనుక అడవిలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి మత్తు ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు తిరుప్పూర్ పెరియతోట్టంకు చెందిన మహ్మద్ ఫైసల్, సద్దామ్‌హుస్సేన్ అని తెలిసింది. ఓ బనియన్ కంపెనీలో టైలర్లుగా పనిచేస్తున్న వీరు ఆన్‌లైన్ ద్వారా మాదకద్రవ్యాలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి, వాటితో మత్తు ఇంజెక్షన్ తయారుచేసి విక్రయిస్తున్నట్లు తెలిసింది.

ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోడికి తపాలాలో గోమయం



తపాలా ద్వారా గోమయం పంపుతున్న డీటీకే నేతలు

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గోమూత్రం తాగితే జ్వరం నయమవుతుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని సంచలనాత్మక ప్రకటన చేసిన ఐఐటీ మద్రాసు డైరెక్టర్ కామకోడికి కోయంబత్తూరుకు చెందిన ద్రావిడ తమిళర్ కట్చి (డీటీకే) నేతలు తపాలాలో గోమయంను పార్శిల్‌గా పంపారు. అక్కడి పోస్టాఫీసులో గోమూత్రాన్ని ప్లాస్టిక్ సీసాలలో నింపి తపాలా ద్వారా పంపారు. ఈ సందర్భంగా డీటీకే నేతలు మాట్లాడుతూ గోమయం ఆరోగ్యానికి మంచిదంటూ ఐఐటీ మద్రాసు డైరెక్టర్ కామకోడి ప్రకటనకు మద్దతు ప్రకటించిన మహిళా మోర్చా నాయకురాలు తమిళిసై సౌందరరాజన్‌కు, శాసనసభ్యురాలు వానతి శ్రీనివాసన్‌కు గోమయంతోపాటు వారికిష్టమైతే గొడ్డు మాంసాన్ని కూడా తపాలాలో పంపేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

మంత్రి రఘుపతికి అస్వస్థత

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి అనారోగ్యం కారణంగా తిరుచ్చిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చెన్నైకి వెళ్లేందుకు రఘుపతి శనివారం ఉదయం పుదుకోట నుంచి తిరుచ్చి విమానాశ్రయానికి వచ్చారు. ఆ సమయంలో గుండెపోటుకు గురయ్యారు. ఆయన్ను వెంటనే తిరుచ్చిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మంత్రికి యాంజియోగ్రామ్ నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు.

నేడు అరిటాపట్టికి వెళ్లనున్న సీఎం స్టాలిన్

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అరిటాపట్టికి ఆదివారం ముఖ్యమంత్రి స్టాలిన్ వెళ్లనున్నారు. మదురై జిల్లా అరిటాపట్టి, పరిసర ప్రాంతాల్లో టంగ్‌స్టన్ ఖనిజం వెలికితీయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అందోళనలు చేపట్టారు. వారికి పలు పార్టీలు మద్దతు తెలిపాయి. టంగ్‌స్టన్ సొరంగం వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతినిధులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. ప్రతినిధుల విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్రం, టంగ్‌స్టన్ సొరంగం వేలం శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటన విడుదల చేసింది. దీంతో, అరిటాపట్టి, పరిసర గ్రామాల ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో, సదరు గ్రామస్తులు శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలుసుకొని, తమ గ్రామానికి ఆహ్వానించారు. దీనిపై సీఎం తన ఎక్స్ పేజీలో... మీ ప్రేమానురాగాలు అంగీకరించేందుకు రేపు అరిటాపట్టికి వస్తున్నాను' అంటూ ట్వీట్ చేశారు.



ప్రపంచ రికార్డు సృష్టించిన అశోకచక్రం

అశోకచక్రం ఆకారంలో 4,500 మంది విద్యార్థులు

ప్యారీస్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా పుదుచ్చేరిలో ఓ ప్రైవేటు కళాశాలలోని విద్యార్థులు రూపొందించిన 'అశోకచక్రం' ఆకారం ప్రపంచ రికార్డు పుస్తకంలో చోటు సంపాదించింది. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ఓ ప్రైవేటు కళాశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో ఆ కళాశాలలో చదువుకుంటున్న 4,500 మంది విద్యార్థులు కలిసి జాతీయ పతాకంలో ఉన్న అశోకచక్రాన్ని రూపొందించారు. ఈ సాధనను అమెరికా ప్రపంచ రికార్డు సంస్థ అధికారి క్రిస్టోఫర్ టైలర్‌క్రాఫ్ట్ పరిశీలించి అధికార పూర్వకంగా నమోదు చేసి దానికి సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని కళాశాల యాజమాన్యానికి అందజేసి, విద్యార్థులను అభినందించారు

బ్యాటరీ కారులో వెళ్లేందుకు ఒకరికి రూ.30 ఛార్జీ



ఊటీ బొటానికల్ గార్డెన్‌లో బ్యాటరీ కారు సేవలు

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ గార్డెన్‌లో పర్యాటకులు బ్యాటరీ కారులో వెళ్లేందుకు ఒకరికి రూ.30 ఛార్జీగా నిర్ణయించారు. ప్రముఖ పర్యాటక కేంద్రం ఊటీ బొటానికల్ గార్డెన్‌లో ప్రతి ఏడాది మే నెలలో ఫ్లవర్ షో, సెప్టెంబరులో రెండో సీజన్ నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో మాత్రమే సందర్శకులు గార్డెన్‌లోని అద్దాల మేడ, ఇటాలియన్ గార్డెన్,సెల్ఫీ పాయింట్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బ్యాటరీ కారు వసతి ఉంది. అనంతరం ఈ కారు సేవలు నిలిపివేస్తుంటారు. ప్రస్తుతం ఈ గార్డెన్‌కు వస్తున్న పర్యాటకులు, బ్యాటరీ కారు సేవలు ప్రతిరోజు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం నుంచి ప్రతిరోజు బ్యాటరీ కారు నడపనున్నట్లు అధికారులు నిర్ణయించారు. 8 మంది వెళ్లే బ్యాటరీ కారులో ఒకరికి రూ.30 ఛార్జీగా వసూలు చేయనున్నట్లు తెలిపారు.

వీరరాఘవ పెరుమాళ్ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం చేస్తున్న దృశ్యం

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ వీరరాఘవ పెరుమాళ్ ఆలయ తై బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 108 దివ్యక్షేత్రాల్లో ఒకటిగా పిలువబడే తిరువళ్లూర్ వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో యేటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. శాలిహోత్ర మహర్షికి వీరరాఘవుడు దర్శనమిచ్చిన రోజు కావడంతో తై బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకత సంతరించుకుంది.ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం 5గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వీరరాఘవుడు స్వర్ణ సప్పరంలో మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా శనివారం గరుడ సేవ వైభవంగా జరిగింది. 29న తై అమావాస్య సందర్భంగా రత్నాంగి సేవ, 30న రథోత్సవం జరగనుంది. ఫిబ్రవరి 2వ తేది ఉత్సవమూర్తులు వివిధ వాహనాల్లో పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నో చెబితే టచ్ చేసే సాహసం చేయరు



తమిళ చిత్రజ్యోతి

● చాందిని తమిళరసన్

'సినిమా పరిశ్రమ సురక్షితమైంది. ఇక్కడ మనల్నికాదనీ జరగదు. నో చెబితే ఎవరూ టచ్ చేసేందుకు సాహసించరు. నో మీన్స్ నో.. వద్దు అంటే ఇక్కడ వద్దనే' అని చిత్రపరిశ్రమలోని క్యాస్టింగ్ కౌచ్‌పై యువ హీరోయిన్ చాందిని తమిళరసన్ కుండబద్దలు కొట్టారు. 'సిద్దు ప్లస్-2'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ భామ.. 'నాన్ రాజావాగ పోగిరేన్', 'విల్ అంబు', 'కట్టాప్పావై కాణోమ్', 'మన్నర్ వాగైయ్యా', 'కసడ తపర' వంటి అనేక చిత్రాల్లో నటించారు. చెన్నైలో పుట్టి పెరిగిన ఈ యువ నటి.. ప్రస్తుతం తమిళంతో పాటు టాలీవుడ్‌లో బిజీగా ఉన్నారు. తాజాగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మనసువిప్పి మాట్లాడారు.

ప్రశ్న: మీ సినీ ప్రయాణం ఎలా సాగుతోంది

జవాబు: సినిమా అనేది మహాసముద్రం. దీన్ని ఈదడం కష్టం. నా సినీ జర్నీ ఊహించనిది. నా ఫ్యామిలీకి సినీ నేపథ్యం లేదు. బాగా చదువుకుని మంచి ఉద్యోగానికి వెళ్లాలన్నదే కుటుంబ సభ్యుల కోరిక.

ప్రశ్న: తొలి ఛాన్స్ ఎలా వచ్చింది

జవాబు: ప్లస్ వన్ చదువుకునే సమయంలో 'మిస్ చెన్నై' పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచా. ఆ తర్వాత సినీ అవకాశాలు రావడం మొదలయ్యాయి. ఒక రోజు 'సిద్దు ప్లస్-2' కోసం దర్శకుడు భాగ్యరాజ్ నుంచి ఫోన్ వచ్చింది. ఆయన్ను కలిసిన తర్వాత సినిమాలో ఎంపిక చేశారు. కానీ, భయం కారణంగా అవకాశాన్ని వద్దని చెప్పా. కొద్ది రోజులకు ఏ ఒక్కరూ హీరోయిన్ పాత్రకు సరిపడకపోవడంతో మళ్లీ ఆ అవకాశం నాకే వరించింది. అలా తొలి అవకాశం దక్కింది.

ప్రశ్న: మనసును గాయపరిచిన సందర్భం ఉందా

జవాబు: పరిశ్రమలోకి అడుగుపెట్టిన కొత్తల్లో నేను కాస్త బొద్దుగా ఉన్నానంటూ హేళన చేశారు. ఇలా కామెంట్స్ చేయడం బాధనిపించింది. స్కూల్ చదువుకునే రోజులు కావడంతో అపుడు కాస్త లావుగానే ఉన్నా. ఆ తర్వాత ఆహార నియమాలు పాటించి నాజూగ్గా తయారయ్యా.

ప్రశ్న: సినీ పరిశ్రమలో మీరు కోరుకునే మార్పు ఏంటి

జవాబు: అనేక మంది ప్రతిభావంతులైన కళాకారులు, నటీనటులకు సరైన అవకాశాలు లభించడం లేదు. గొప్ప టాలెంట్ ఉన్న వారికి అవకాశాలు నిరాకరిస్తున్నారు. సినిమాల విజయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, నటీనటుల ప్రతిభకు అవకాశాలివ్వాలి.



పేరు : చాందిని తమిళరసన్
నిక్ నేమ్ : డింపు
పుట్టిన తేది : ఆగస్టు 12
పుట్టిన ఊరు : చెన్నై
ఎత్తు : 5.6 అడుగులు
ఇష్టమైన హీరో : అజిత్ కుమార్
ఇష్టమైన నటి : జ్యోతిక
ఇష్టమైన ఆహారం : మటన్ బిర్యానీ
ఇష్టమైన దుస్తులు : కుర్తా, లెగ్గిన్స్
లక్కీనెంబర్లు : 3, 6

ప్రశ్న: హీరోయిన్లకు ఎక్స్‌పోజింగ్ అవసరమా

జవాబు: కచ్చితంగా.. ఎక్స్‌పోజింగ్ కావాలి. హీరోయిన్లకు అన్ని అంశాలతో పాటు అందాల ఆరబోత ముఖ్యం. టూపీస్ దుస్తులు ధరించడం మాత్రమే ఎక్స్‌పోజింగ్ కాదు. ముఖంలో భావాలను వ్యక్తం చేయాలి. క్లోజ్‌అప్ షాట్‌లో కూడా ఎక్స్‌పోజింగ్ చేయొచ్చు. ముఖ్యంగా స్టోరీ డిమాండ్ చేస్తే గ్లామర్‌గా నటించాల్సిందే.

ప్రశ్న: పాన్ ఇండియా చిత్రాల్లో ఎపుడు నటిస్తారు?

జవాబు: పాన్ ఇండియా చిత్రాల్లో నటించడమే నా లక్ష్యం కాదు. నాకు అవకాశం లభించే ప్రతి చిత్రంలోనూ బాగా నటించి అందరితో శెభాష్ అనిపించుకోవాలి.

ప్రశ్న: మీ బలం.. బలహీనత ఏంటి?

జవాబు: నా బలం పట్టుదల (విడాముయర్చి). నా బలహీనత సాఫ్ట్ నేచర్.

లారెన్స్ సరసన నోరా ఫతేహి



ప్రముఖ నృత్య దర్శకుడు, సినీ నిర్మాత, దర్శక హీరో రాఘవ లారెన్స్ నిర్మించే 'కాంచన-4' కోసం బాలీవుడ్ హీరోయిన్ నోరా ఫతేహిని ఎంపిక చేశారు. తాను హీరోగా నటిస్తున్న 'బెంజ్' చిత్రీకరణ ఆలస్యంకావడంతో తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కించే 'కాంచన-4'పై ఆయన దృష్టి సారించారు. ఇందులో హీరోయిన్‌గా ఇప్పటికే పూజా హెగ్డేను ఎంపిక చేయగా, తాజాగా నోరా ఫతేహితో డీల్ కుదుర్చుకున్నారు. 'కాంచన' సిరీస్‌లో ఇప్పటివరకు వచ్చిన చిత్రాలను భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ నాలుగో భాగాన్ని ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా రూపొందించాలని లారెన్స్ సన్నాహాలు చేశారు. గోల్డ్ మైన్స్ పతాకంపై నిర్మించే ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి వినోదాత్మకంగా తెరకెక్కించనున్నారు. ఈ యేడాది ఆఖరులో ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా నిర్మాతలు సన్నాహాలు చేపడుతన్నారు.

ప్రకటనకు ముందే...

● వివాదంలో ఎస్‌కే మూవీ టైటిల్



శివకార్తికేయన్

ప్రముఖ హీరో శివకార్తికేయన్(ఎస్‌కే) చిత్రం ప్రకటనకు ముందే టైటిల్ వివాదంలో చిక్కుకుంది. ఎస్‌కే , జయం రవి, అధర్వ మురళి, శ్రీలీల ప్రధాన పాత్రల్లో సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రానికి 'పరాశక్తి' అనే పేరును ఖరారు చేసినట్టు అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ టైటిల్‌ను ఎంపిక చేయడాన్ని శివాజీ సాంఘిక సంక్షేమ మండలి తీవ్రంగా వ్యతిరేకిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేసింది. 'పరాశక్తి' అనేది ఒక సినిమా టైటిల్ మాత్రమే కాదు. 1952 ముందు, 1952 తర్వాత అని చిత్రపరిశ్రమను వేరు చేయొచ్చు. ఆవేశపూరితమైన డైలాగులతో, భావోద్వేగంతో కూడిన నటనతో సామాజిక విప్లవం తీసుకొచ్చిన చిత్రం. ఈ టైటిల్‌లో కొత్త నటీనటులతో మరో చిత్రాన్ని తీయడం సమంజసం కాదు. యుగ కళాకారుడుగా, సినీ ప్రపంచ ముద్దుబిడ్డ కలైంజర్ కరుణానిధి విప్లవాత్మక సంభాషణలు తోడు శివాజీ గణేశన్ తన భావోద్వేగ అభినయంతో యావత్ తమిళ సినీ ప్రపంచానికి లభించిన ఆణిముత్యం 'పరాశక్తి'. ఇపుడు తమిళ చిత్రపరిశ్రమకు ఏమైందో తెలియదు.. కథలకు కొరత ఏర్పడిందని తెలుస్తుంది. అందుకే రీమేక్స్, రీమిక్స్ పేరుతో గతంలో పాపులర్ అయిన పాత చిత్రాలను ఛిద్రం చేస్తున్నారు. చివరకు సినిమా టైటిల్స్‌ను కాపీ కొడుతున్నారు. 'పరాశక్తి' అనే టైటిల్‌ను మరో చిత్రానికి పెట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు ఖండిస్తున్నామని పేర్కొంది. చిత్ర టైటిల్‌ను మార్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామంని ఆ మండలి నిర్వాహకులు హెచ్చరించారు.

టీవీకేలో కొత్త కార్యవర్గాల నియామకం



జిల్లా కార్యదర్శులుగా ఎంపికైన నేతలను అభినందిస్తున్న టీవీకే అధినేత విజయ్

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)లో భారీ స్థాయిలో జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేసి ఆ పార్టీ అధినేత విజయ్ సంచలనం సృష్టిస్తున్నారు. పార్టీలో 3.5లక్షల మందికి వివిధ రకాల పదవులను కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. డీఎంకే, అన్నాడీఎంకేలకు 70 నుంచి 80 జిల్లాశాఖలు ఉండగా, విజయ్ తన పార్టీకి 120 పార్టీ జిల్లా శాఖలతో కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల్లో పార్టీ ప్రథమ వార్షికోత్సవం జరుగనున్న నేపథ్యంలో పనయూరులో తన నివాసగృహంలోని ప్రధాన కార్యాలయంలో పార్టీ నిర్వాహకులతో వారం రోజులకు పైగా చర్చించి కొత్త జిల్లా శాఖలకు నాయకులను నియమించారు. 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు జిల్లా శాఖల చొప్పున కార్యదర్శుల నియామకాలు జరిగాయి. ఆ ప్రకారం పార్టీలో 468 మందిని జిల్లా కార్యదర్శులుగా నియమించారు. ఇక ప్రతి జిల్లాలో కార్యదర్శుల దిగువన కనీసం ఐదారుగురు చొప్పున కార్యవర్గ సభ్యులను కూడా నియమించనున్నారు.

విజయ్‌ను ఆదిలోనే తొక్కేయడం భావ్యం కాదు

● సినీ నటుడు పార్తిబన్

ప్యారీస్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన ప్రముఖ నటుడు విజయ్‌ను ఆదిలోనే తొక్కేయడం భావ్యం కాదని సినీ నటుడు పార్తిబన్ ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రారంభించిన విజయ్, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయనున్నట్లు చేసిన ప్రకటన అధికార పార్టీకి చెందిన ప్రముఖులను ఆందోళనకు గురి చేసిందన్నారు. కొత్తగా ప్రారంభించిన పార్టీ వెంటనే జరిగే ఎన్నికల్లో మెజార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆ పార్టీ నిర్వాహకులు ఆశిస్తుంటారని, విజయ్ పార్టీ కార్యకర్తలు కూడా అభిప్రాయపడడంలో తప్పు లేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విజయ్, టీవీకే పార్టీని విమర్శించారని, రాజకీయాల్లో 40 ఏళ్లుగా కొనసాగుతున్న ఆయన, మరో పార్టీ గురించి వ్యాఖ్యానించడం భావ్యం కాదని పార్తిబన్ అభిప్రాయపడ్డారు.

తిరునల్వేలి రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు



చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి రైల్వే జంక్షన్‌కు బాంబు బెదరింపు రావటంతో పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మెటల్ డిటెక్టర్లు, జాగిలాలతో రైల్వే స్టేషన్ అంతటా సోదాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చెన్నైలో పోలీసు కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి తిరునల్వేలి రైల్వే స్టేషన్ వద్ద బాంబులు పేలనున్నాయని తెలిపి ఫోన్‌ని కట్ చేశారు. దీనితో అప్రమత్తమైన చెన్నై పోలీసులు తిరునల్వేలి పోలీసులకు సమాచారం అందించటంతో తనిఖీలు చేపట్టారు. అది హోక్స్ కాల్‌గా తేలింది.

వేళచ్చేరిలో ఫోర్‌పాయింట్స్ షెరటాన్ స్టార్‌హోటల్



అడయార్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలో ఫోర్‌పాయింట్స్ షెరటాన్ - చెన్నై పేరుతో స్టార్ హోటల్‌ను ప్రారంభించారు. కృష్ణ గ్రూపు సహ కారంతో స్థాపించిన హోటల్ ఆకర్షణీయ, సమకాలీన ఆతిథ్యానికి ప్రత్యేకంగా నిలిచింది. మారియట్ బోన్వోయ్ గ్రూపు లగ్జరీ హోటళ్లలో ఇది ఒకటి. చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు 10 కిలోమీటర్ల దూరంలోనూ, నగరంలోని ప్రధాన ప్రాంతాలకు 6 నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. ముఖ్యంగా ఓఎంఆర్ బిజినెస్ కారిడార్‌కు అతి సమీపంలో ఉందని మారియట్ ఇంటర్నేషనల్ సౌత్ ఏషియా వైస్‌ప్రెసిడెంట్ (ఏరియా) రంజు అలెక్స్ పేర్కొన్నారు.

ఇన్‌స్పైర్ - నమ్మ చెన్నై అవార్డుల ప్రదానం



ఆర్కాటు నవాబుతో విజేతలు

అడయార్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభను కనబరిచి ఇతరులకు మార్గదర్శకంగా నిలిచిన పలువురికి ఇన్‌స్పైర్ - నమ్మ చెన్నై పేరుతో సుగన్ లైఫ్‌స్టైల్ అవార్డులను ప్రదానం చేసింది. ఆర్కాట్ నవాబ్ మొహ్మద్ ఆసిఫ్ అలీ చేతుల మీదుగా టి.నగర్‌లోని మాన్యవర్ మోహే ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఎంటర్‌ప్రిన్యుర్ అవార్డును దివ్య అభిషేక్, ఫ్యాషన్ అవార్డును ఆదిత్య, పేరెంటింగ్ అవార్డును శృతి నకుల్, ట్రావెల్ ఇన్ఫ్లూయెన్సర్ అవార్డును రెబెకా, గౌతమ్ తదితరులు ప్రదానం చేశారు.

ఆలపాటి రామచంద్రరావు సేవలు చిరస్మరణీయం

● జయంతి వేడుకల్లో వక్తలు



ఆలపాటి రామచంద్రారావుకు నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

పెరంబూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వేలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపిన అంబికా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత దివంగత ఆలపాటి రామచంద్రరావు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. రామచంద్రరావు 100వ జయంతి వేడుకల సందర్భంగా వడపళనిలోని అంబికా ఎంపైర్ హోటల్‌లో శనివారం వైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత రామచంద్రరావు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబికా ఎంపైర్ జీఎం కాలాతినాథన్ మాట్లాడుతూ... అగరబత్తి రంగాన్ని ప్రారంభించిన రామచంద్రరావు అనతికాలంలోనే హోటల్, సినిమా, రియల్ ఎస్టేట్, విండ్ మిల్ తదితర రంగాలకు విస్తరించారన్నారు. ఆయన ప్రారంభించిన సంస్థల్లో వేలాది మంది జీవనోపాధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం తమ కంపెనీ ఛైర్మన్ అంబికా కృష్ణ ఆయన సేవలు కొనసాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం చెన్నై, సేలం, విశాఖపట్నం, ఏలూరులో తమ హోటల్లు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ... అంబికా సంస్థతో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభకు అనుబంధం ఉందన్నారు. అంబికా కృష్ణ ప్రస్తుతం తమ సంస్థ గ్లోబల్ లీడర్‌గా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో అంబికా ఎంపైర్ హోటల్ అడ్మిన్ పుష్ప, అపోలో హాస్పిటల్ మార్కెటింగ్ ఆఫీసర్ రతీష్ సహా పలువురు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో జయ మేనకోడలు దీపా అప్పీల్



చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసులో దివంగత మాజీ సీఎం జయలలితకు చెందిన ఆస్తులను తనకు అప్పగించాలని కోరుతూ ఆమె మేనకోడలు దీపా సుప్రీంకోర్టులో అప్పీలు చేయడానికి సన్నాహాలు చేపడుతున్నారు. 2014లో అక్రమార్జన కేసులో జయ, ఆమె సన్నిహితురాలు శశికళ, ఆమె బంధువులు సుధాకరన్, ఇళవరసికి బెంగళూరు ప్రత్యేక కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. జయకు రూ.100 కోట్లు, తక్కిన ముగ్గురికి తలా రూ.10 కోట్ల మేరకు జరిమానా కూడా విధించింది. ప్రత్యేక కోర్టు తీర్పును సుప్రీంకోర్టు ఖరారు చేసినప్పుడు జయ మృతిచెందారు. దీంతో ఆ కేసు నుంచి ఆమె పేరును తొలగించారు. శశికళ సహా ముగ్గురు బెంగళూరు పరప్పన అగ్రహారం జైలులో నాలుగేళ శిక్షను అనుభవించారు. ఆ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన సంఘ సేవకుడు నరసింహమూర్తి... జయలలితకు సంబంధించిన చరాస్తులను వేలం వేసేలా కర్ణాటక ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలని బెంగళూరు సెషన్స్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఆ పిటీషన్‌పై విచారణ కొనసాగుతోంది. అదే సమయంలో మద్రాసు హైకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం జయకు తానే వారసురాలు గనుక ఆమె ఆస్తులను తనకే అప్పగించాలని కోరుతూ దీపా బెంగళూరు సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చటమే కాకుండా జయ చరాస్తులన్నింటినీ వేలం ద్వారా విక్రయించి ఆ సొమ్ముతో ఆమెకు విధించిన జరిమానా రాబట్టాలని ఆదేశించింది. సెషన్స్‌కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ దీపా కర్ణాటక హైకోర్టులో దాఖలు చేసిన అప్పీలు పిటీషన్ కూడా తోసివేతకు గురైంది. దీంతో బెంగళూరు సెషన్స్‌కోర్టులో జయ చరాస్తులను వేలం వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ శుక్రవారం న్యాయమూర్తి మోహన్ ఎదుట విచారణకు వచ్చింది. జయ మేనకోడలు దీపా తరపు న్యాయవాది హాజరై కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలు చేయనున్నామని, హైకోర్టు ఉత్తర్వు నకలు ఇంకా అందలేదని, ఈ పరిస్థితులలో విచారణను వాయిదా వేయాలని కోరారు. ఆ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి మోహన్ కేసు తదుపరి విచారణను 29కి వాయిదా వేశారు. ఈకేసులో జయకు చెందిన సుమారు 27 కిలోల బంగారునగలు, వజ్రాభరణాలు, 1,526 ఎకరాల భూములను కర్ణాటక ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించనుంది.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

విద్యార్థులకు బహుముఖ పరిజ్ఞానం అవసరం

● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జ్ఞానదేశికన్

ప్యారీస్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, విద్యార్థులు రాణించాలంటే బహుముఖ పరిజ్ఞానం అవసరమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జ్ఞానదేశికన్ పేర్కొన్నారు. స్థానిక మొగప్పేర్ ఆదిపేట తులసి గార్డెన్‌లో ఉన్న బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. పాఠశాల ఛైర్మెన్ ఆర్.సురేష్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ వేడుకల్లో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.మధుసూధన్, డైరెక్టర్లు డేగా విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్.లక్ష్మి సురేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ హరీందర్ కౌర్ సహా టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. డిజిటల్ ఫుట్ ప్రింట్ పేరుతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అందర్నీ ఆకట్టుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.



శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

తిరుమలకు శ్రీవారి భక్తుల పాదయాత్ర

● గోవింద నామస్మరణతో మార్మోగిన వెంకటేశ్వర నగర్ ఆలయం

ప్యారీస్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగైయూర్ వెంకటేశ్వర నగర్‌లోని శ్రీ సిద్ధి వినాయక శ్రీనివాస వేంకట ముడయాన్ తిరుక్కోయిల్ సేవార్థిగళ్ సంఘం ఆధ్వర్యంలో త్రిదండి చినజీయర్ స్వామి మంగళ శాసనాలతో 23వ వార్షిక తిరుపతి తిరుమల పాదయాత్ర శనివారం మధ్యాహ్నం ప్రారంభమైంది. ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి పీబీ బాలాజి పాదయాత్రను ప్రారంభించారు. సంఘ నిర్వాహకులు ఎస్.రవిచంద్రన్, బోడి శ్రీనివాసులు, బీహెచ్ శ్రీనివాస్, ఎన్వీ భాస్కర్, ఎన్.జగన్నాథం, కోడి భావనారాయణ, జీవీఆర్ భాస్కర్ తదితరుల నేతృత్వంలో 150 మంది భక్తులతో పాదయాత్ర గోవింద నామస్మరణల మధ్య సాగింది. ముందుగా ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈ నెల 29న తిరుమలకు చేరుకోనున్న పాదయాత్ర బృందం శ్రీవారిని దర్శనం చేసుకొని మరుసటిరోజు తిరిగొస్తారు.